'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఆర్తులకు ఆపన్నహస్తం

'కూటి కోసం, కూలి కోసం.. పట్టణంలో బతుకుదామని.. బయలుదేరిన బాటసారికి.. ఎంతకష్టం ఎంత కష్టం..' అని మహా కవి శ్రీశ్రీ బతుకుదెరువు కోసం వలసపోయినోళ్ల కష్టాలు కండ్లకు కట్టారు. 'బాటసారి' అనే శీర్షికతో రాసిన ఆ కవిత చదివినవాళ్లు కన్నీళ్లు పెట్టుకోకుండా ఉండలేరు. సువిశాలమైన భారతదేశంలో ఊరుగాని ఊరు.. పల్లెగాని పల్లెకు పోయి అక్కడ బతకలేక, వెనుకకు రాలేక నలిగిపోయేవారెందరో. బొంబాయి లాంటి మహానగరాలకు ఉపాధి వెతుక్కుంటూ పోయినవాళ్ల బాధలు వింటేనే గుండె తరుక్కుపోతుంది. ఇక దుబాయి లాంటి నగరాలకు, దేశంగాని దేశాలకు పోతే చెప్పేదేముంది. నాలుగు రోజులు కష్టపడితే నాలుగు మైసలు కండ్లజూస్తామని అనుకొని.. అప్పులతో రెక్కలు కట్టుకుని ఎగిరిపోయే అమాయకులు ఎందరో. ఇసుక ఎడారుల్లో బతుకు తడారి శుష్కించిపోయే అభాగ్యులూ ఉంటారు. తెలిసీతెలియక, చేసేచేయని నేరాలకు జైళ్లల్లో మగ్గేవాళ్ల గోస చెప్పనలవి కాదు. అలాంటి ఓ ఐదుగురు తెలంగాణ బిడ్డలు దుబాయి చెర నుంచి బయటపడి, ప్రాణాలు ఉగ్గబట్టుకొని తమ ఊరికి చేరుకొని, తమ వారిని కండ్లారా చూడగలగటం ఓ ఉద్విగ్నభరిత దృశ్యం. తెలంగాణ తల్లి కండ్లు చెమర్చిన క్షణం.

విదేశాల్లో సమస్యల్లో చిక్కుకున్న భారతీయులకు దౌత్య కార్యాలయాల సేవలు అంత సులభంగా అందుబాటులో ఉండవు. బాధితులు సాధారణంగా కడు పేదలే ఉంటారు. కుటుంబ సభ్యులకు దిక్కుతోచదు. ఏం చేయాలో పాలుపోదు. ఎవరిని అడగాలో, ఎవరు ఆదుకుంటారో తెలియదు. విధిని నమ్ముకోవడం తప్ప గత్యంతరం ఉండదు. పైన తెలిపిన ఐదుగురు ఖైదీల పరిస్థితీ అంతే. ఓ నేపాలీ హత్య కేసులో వారు చిక్కుకున్నారు. కోర్టు పాతికేండ్ల శిక్ష వేసింది. దీంతో వారు దిక్కులేని పక్షులయ్యారు. కుటుంబాలు అనాథలయ్యాయి. వారి దీన గాథలు తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆత్మబంధువులా ఆదుకున్నారు. అడుగడుగునా చేయూతనందించి గట్టెక్కించారు. స్వయంగా నేపాల్‌కు వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి రూ.15 లక్షలు పరిహారంగా అందజేశారు. క్షమాభిక్ష పత్రాలపై సంతకాలు చేయించారు. ఇది జరిగింది 2011లో. అప్పటికింకా తెలంగాణ ఏర్పాటు కాలేదు.

ఆ సంగతి అలా ఉంచితే, క్షమాభిక్ష వ్యవహారంలో కథ అడ్డం తిరిగింది. సమస్య ఎదురైంది. మారిన చట్టాల కారణంగా విడుదల చేయడం వీలుకాలేదు. అయినా కేటీఆర్ పట్టు వదలకుండా దుబాయిలో బాధితులతో కేసు వేయించారు. విదేశాంగ శాఖను కదిలించారు. దుబాయి రాజుతో మాట్లాడారు. మొత్తంమీద ఆయన చూపిన చొరవ, చేసిన కృషి ఫలితంగా ఐదుగురూ 18 ఏండ్ల తర్వాత సలక్షణంగా విడుదలై సొంత గడ్డకు తిరిగి వచ్చారు. సుమారు రూ.30 లక్షల ఖర్చును కూడా కేటీఆరే భరించడం గమనార్హం. ఇది ఆయన ఓపికకూ, కార్యదీక్షతకూ అద్దం పట్టే వ్యవహారమని చెప్పాలి. ఇందుకు కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలనే మనసు మాత్రమే ఉంటే సరిపోదు, నిండైన అంకితభావమూ ఉండాలి. అవి తనలో నిండుగా ఉన్నాయని ఈ ఉదంతంతో చాటుకున్నారు బీఆర్ఎస్ నేత కేటీఆర్.

ప్రజల గొంతుకవుతాం.. ప్రశ్నిస్తాం

ప్రజల తీర్పు, అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవడం రాజకీయ పార్టీల విధి, బాధ్యత. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్‌పై ఈ బాధ్యత ఇంకా ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతిపక్ష పాత్రను పోషించాలన్న జనాదేశాన్ని సమర్థంగా అమలు చేస్తున్నది. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపడం, ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఎప్పటికప్పుడు గుర్తుచేయడం, ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం ప్రతిపక్షాల కర్తవ్యం. ఇది కూడా ఒకవిధంగా ప్రజలు ఇచ్చిన అధికారమే.

కాంగ్రెస్ కన్నా కాస్త తక్కువ ఓట్లు సంపాదించి అధికారానికి దూరమైనప్పటికీ, ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడిగే పవర్‌ను మాత్రం ప్రజల ద్వారా పొందింది బీఆర్ఎస్. ఆ ప్రజాబలాన్ని చూసుకొనే.. కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీయగలుగుతున్నది. సమర్థవంత మైన ప్రతిపక్షం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. అలాంటి సందర్భంలోనే వ్యవస్థలన్నీ సక్రమంగా పని చేస్తాయి. ప్రగతి కూడా సాధ్యపడుతుంది.

గోసుల శ్రీనివాస్ యాదవ్

బీఆర్ఎస్ విషయానికి వస్తే.. కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలందరూ ప్రతిపక్ష పాత్రలో చక్కగా ఇమిడిపోయారు. ఉద్యమ పార్టీకి ఇలాంటి విధులు కొత్తేమీ కాదు. ఈ విషయంలో సీనియర్ నేత హరీశ్‌రావు పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించాల్సి ఉంటుంది. దాదాపు పాతికేండ్ల రాజకీయ జీవితంలో ప్రభుత్వంలోనూ, విపక్షంలోనూ చిత్తశుద్ధితో పని చేసిన అనుభవం ఇప్పుడు అక్కరకు వస్తున్నది. ఎన్నికల్లో ఓటమిపాలై నిరాశతో ఉన్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడం, కేసీఆర్ సర్కార్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడం, ప్రభుత్వ పెద్దలు చెప్పే విషయాల్లో వాస్తవాలెంత? అవాస్తవాలెంత? అన్న విషయాన్ని విడమర్చి ప్రజలకు చెప్పడం, ప్రభుత్వ హామీలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్తూ విపక్ష నేత ఎలా వ్యవహరించాలో రుజువు చేస్తున్నారు హరీశ్‌రావు. ఎక్కడా వ్యక్తిగత విమర్శలు, దూషణల జోలికి పోకుండా ప్రజల సమస్యలపైనే మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇటీవల అసెంబ్లీలో చర్చకు వచ్చిన మూడు అంశాలను పరిశీలిస్తే.. విపక్షంగా బీఆర్ఎస్ పనితీరు ఏమిటో అర్థమవుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ విరుచుకపడింది. కాళేశ్వరం దగ్గర ప్రాజెక్టు నిర్మించడమే వృథా అని, గతంలో ప్రతిపాదించిన విధంగా తుమ్మిడిహట్టి వద్ద నిర్మించి ఉంటే బాగుండేదని పదేపదే కాంగ్రెస్ వాదించింది. అయితే ఆ వాదనను హరీశ్‌రావు బలంగా తిప్పికొట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎందుకు రీడిజైన్ చేయాల్సి వచ్చిందో అరటిపండు వలిచినట్టు విడమర్చి చెప్పారు హరీశ్‌రావు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే మహారాష్ట్రలోని దాదాపు మూడు వేల ఎకరాలు ముంపునకు గురవుతాయి. ఇందుకు అక్కడి కాంగ్రెస్ పార్టీగానీ, బీజేపీగానీ ఒప్పుకోలేదు. పైగా ఉద్యమాలు చేశాయి. పోనీ, దీనిపై తెలంగాణకు చెందిన ఆయా పార్టీల నాయకులు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారా? అంటే అదీలేదు. ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని మార్చడం తప్ప మరో మార్గమే లేదు. అందుకే ముంపు తక్కువగా ఉండే కాళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మించాల్సి వచ్చింది. ముంపు విస్తీర్ణం తగ్గేలా తుమ్మిడిహట్టి వద్దనే ప్రాజెక్టు కడితే.. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. తద్వారా చేవెళ్ల వరకు నీరు పారించి, గోదావరి-కృష్ణా ఆయకట్టులను అనుసంధానం చేయాలన్న లక్ష్యం నెరవేరదు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికీ తాగునీరు లభించదు. గోదావరి జలాల తరలింపు అంతర్రాష్ట్ర వివాదం కాకూడదన్న ఉద్దేశంతోనే ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాల్సి వచ్చింది. అంతే తప్ప మరో ఉద్దేశమే లేదు. అంతర్రాష్ట్ర జల వివాదమా? అధిక వ్యయమా? దేనివైపు మొగ్గు చూపాలన్న ధర్మ సందేహం తలెత్తినప్పుడు దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా సహజంగానే రెండో దానికి అంగీకారం తెలుపుతారు. ఇది ప్రజానీకంతో పాటు పార్టీ శ్రేణులకూ బోధపడింది.

కాంగ్రెస్ సర్కార్ చెప్పిన మరో అసత్యం మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణం గురించి. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీయే కట్టిందని హస్తం సర్కార్ చెప్పుకొచ్చింది. అది నిజం కాదని అసెంబ్లీ సాక్షిగా హరీశ్‌రావు నిరూపించారు. మానేరు ప్రాజెక్టులపై ఆనకట్టలు నిర్మించడమన్నది శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పనుల్లో అంతర్భాగంగా ప్రతిపాదించారు. అప్పర్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులను నిర్మించినా మధ్యలోని మిడ్ మానేరు ప్రాజెక్టును ఉమ్మడి ప్రభుత్వాలన్నీ మరిచిపోయాయి. తెలంగాణ సిద్ధించి కేసీఆర్ సర్కార్ వచ్చిన తర్వాతే ఆ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. కరువు నేల పచ్చగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారంలో ఎన్ని అవాస్తవాలు ఉన్నాయో ప్రజలకు విడమర్చి చెప్పారు హరీశ్‌రావు.

> కృష్ణా నది ప్రాజెక్టుల నిర్వహణ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ పక్షాన అడ్డుకోవడంలో హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారు. కేసీఆర్ సర్కారే వీటిని కేంద్రానికి అప్పగించాలని ప్రతిపాదన చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాదనను ఆయన సమర్థవంతంగా తిప్పికొట్టారు. ప్రాజెక్టులను అప్పగించబోమంటూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదింపజేశారు. సాగునీటి రంగంపై ఎంతగానో ప్రభావితం చేసే ఈ నిర్ణయం విపక్ష విజయమేనని చెప్పకతప్పదు.

అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు పదేపదే చెప్తూనే ఆ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను గుర్తు చేస్తున్నారు. అందులో ఒకటి.. ముఖ్యమంత్రే స్వయంగా ప్రతిరోజూ ప్రజాభవన్‌కు వెళ్లి వినతులు స్వీకరించడం. ఈ మాట స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారు. వాస్తవానికైతే తీరికలేని పనుల దృష్ట్యా ప్రతి రోజూ ముఖ్యమంత్రి ప్రజలను కలవడం సాధ్యం కాకపోవచ్చు. కానీ, స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారు కాబట్టి దాన్ని అమలు చేయకతప్పదు. దాన్నే హరీశ్‌రావు ప్రస్తావించగా.. ముఖ్యమంత్రి వెళ్లకతప్పలేదు.

> ప్రజల వ్యక్తిగత సమస్యలు, సామూహిక సమస్యల పరిష్కారంపై బీఆర్ఎస్‌కు స్పష్టమైన విధానం ఉంది. అదే అధికార వికేంద్రీకరణ. సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతోనే చిన్న జిల్లాలు, చిన్న మండలాలను ఏర్పాటు చేసింది కేసీఆర్ సర్కార్. ఏ సమస్యను, ఎవరు పరిష్కరించాలో దిశానిర్దేశం చేసింది. ఉదాహరణకు ఎవరికైనా రేషన్‌కార్డు కావాల్సి వస్తే దాన్ని మండల స్థాయిలోనే పరిష్కరించాలి. ఇందుకు వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితర ఎందరో ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వారితో పాటు అదే స్థాయిలో అధికార యంత్రాంగం కూడా ఉంది. పార్లమెంట్ సభ్యులనో, ఎమ్మెల్యేలనో, ఇతర ప్రముఖులనో కలిసి వినతిపత్రాలను సమర్పించే వెసులుబాటు కూడా ప్రజలకు ఉంది. ఆ వినతిపత్రాలను వారు సంబంధిత అధికారులకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించే సంప్రదాయం కూడా ఉంది. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా దాన్ని పరిష్కరించడానికి ఎక్కడికక్కడ ఏదో ఒక విధమైన వ్యవస్థ ఉండనే ఉంది. వీటన్నింటి ద్వారా పని కానప్పుడు మాత్రమే హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రికి వినతిపత్రాలు ఇవ్వాలి.

ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఏమిటన్నది ఇంకా తెలియడం లేదు. ప్రజాభవన్‌లో ఇచ్చిన వినతిపత్రాల్లో ఎన్నింటిని పరిష్కరించారన్న దానిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇచ్చిన హామీల్లో ఇదే సరళమైనది. వ్యవస్థాగతంగా చిన్నచిన్న మార్పులు చేర్పులు చేసుకుంటే చాలు. పెద్దగా కష్టపడాల్సిందేమీ లేదు. ఇలాంటి చిన్న హామీలు కూడా అమలు కాకపోవడంపైనే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రశ్నించింది. అధికారంలో లేనంత మాత్రాన బీఆర్ఎస్ ప్రజాబలం లేని పార్టీ ఏమీ కాదు. ప్రజల గొంతుకగా మారి ప్రభుత్వ తప్పులను గట్టిగా ప్రశ్నించేటంతటి శక్తిని బీఆర్ఎస్ పొందింది. ఆ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుకు సాగుతున్నది.

న్యాయాన్వేషణలో దివిటీ నారీమన్

> దేశ ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడేందుకు నిరంతరం పోరాటం చేసిన యోధుడు ఫాలీ సామ్ నారీమన్. స్వేచ్ఛాయుత ప్రపంచం కోసం ప్రతీ క్షణం పరితపించారాయన. దశాబ్దాల తన వృత్తి జీవితంలో రాజ్యాంగవాదిగా, లౌకికవాదిగా, ప్రాథమిక హక్కుల రక్షకుడిగా ఎన్నెన్నో పాత్రలను సమర్థవంతంగా పోషించారు నారీమన్. కోర్టుల్లో, కోర్టు బయట తన వాదనలతో రాజ్యాంగాన్ని సజీవంగా ఉంచారాయన.

మాలోతు సురేష్
98856 79876

న్యాయ కోవిదుడు నారీమన్ మరణంతో మన దేశం ఓ న్యాయ దిగ్గజాన్ని కోల్పోయింది. భారత్‌లో లక్షల మంది న్యాయవాదులు ఉండవచ్చు. కానీ, దేశ గతిని మార్చేసిన కేసుల్లో భాగమైన వారిని వేళ్లపైనే లెక్కించవచ్చు. అలాంటివారిలో ఒకరు నారీమన్. 70 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారు. ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు హననానికి గురవకుండా ఇటు న్యాయస్థానాల్లోనూ, అటు న్యాయస్థానాల వెలుపల కూడా తన గళాన్ని వినిపించారు. సుప్రీంకోర్టు వెలువరించిన అనేక చరిత్రాత్మక కేసుల్లో వాదించిన ఘనాపాటిగా ఆయనకు పేరుంది.

నారీమన్ గొప్ప మానవతావాది. అన్యాయం జరిగిందని ఎవరు కోర్టు మెట్లెక్కినా ఆయన వెన్నంటి ఉండేవారు. న్యాయపరంగా సాయం చేసేవారు. ఈ క్రమంలోనే ఎన్నో ప్రతిష్టాత్మక కేసుల్లో భాగమయ్యారు. ఇప్పటికీ అనేక కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానానికి మార్గదర్శిగా నిలుస్తున్న కేశవానంద భారతి తీర్పు ఈ కోవలోనిదే.

న్యాయం ప్రతిఒక్కరికీ దక్కాలని భావించే నారీమన్.. అందుకోసం అహర్నిశలు శ్రమించారు. పాలకుల చెప్పుచేతల్లోకి న్యాయస్థానాలు వెళ్లకుండా చేయడంలో కీలక భూమిక పోషించారు. నేషనల్ జ్యుడిషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ (ఎన్‌జేఏసీ) పేరిట కేంద్ర ప్రభుత్వం తెరలేపిన కుట్రను సమర్థంగా ఛేదించి పరిపాలనా యంత్రాంగానికి న్యాయవ్యవస్థ బానిసగా మారకుండా కాపాడారు. న్యాయమూర్తులను నియమించే హక్కు న్యాయస్థానాలకు రాజ్యాంగమే కల్పించిందని వాదించి న్యాయస్థానాల స్వతంత్రతను కాపాడారాయన. కొలీజియం వ్యవస్థ పురుడుపోసుకోవడానికి ఆద్యుడు నారీమనే. ఆయన వాదించిన 'సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ – యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు మూలంగానే కొలీజియం వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అయితే కొలీజియం వ్యవస్థపై కూడా ఆయన విమర్శలు సంధించడం గమనార్హం. 'హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమించే సుప్రీంకోర్టు మొదటి ఐదుగురితో కూడిన కొలీజియంలో నాకు ఎటువంటి ప్రత్యేకతలు కనిపించడం లేదు. సీనియారిటీలో మాత్రమే వారు మొదటి ఐదుగురు.. విజ్ఞతలో కాదు' అని బహిరంగంగా విమర్శించిన ధీశాలి నారీమన్.

స్వాతంత్ర్యానికి పూర్వమే బర్మా ప్రావిన్స్‌లో జన్మించిన నారీమన్ అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. బాంబే హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు తనదైన ముద్ర వేశారు. బాంబే హైకోర్టు నుంచి మొదలైన ఆయన ప్రస్థానం బార్ అసోసియేషన్ అఫ్ ఇండియా అధ్యక్షుడి వరకు అప్రతిహతంగా కొనసాగింది. ప్రపంచవ్యాప్తంగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది.

నారీమన్ రాజ్యసభ సభ్యుడిగానూ రాణించారు. వృత్తి పరంగా ఎంత బిజీగా ఉన్నా ప్రజల తరపున పార్లమెంట్‌లో గళం వినిపించే ఏ ఒక్క అవకాశాన్ని ఆయన వదులుకోలేదు. ప్రజలకు చేసిన సేవలకుగానూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు ఆయన్ను వరించాయి. తన వృత్తి జీవితంలో ఎన్నెన్నో పదవులను అధిరోహించిన నారీమన్.. ఏనాడూ వాటి కోసం పాకులాడలేదు. ఆధిపత్యం, అహంకారం– ప్రాథమిక హక్కులకు మధ్య జరిగిన పోరులో నిస్సందేహంగా హక్కుల వైపే నిలబడ్డారాయన. అందుకు తన పదవులను కూడా తృణప్రాయంగా వదిలేశారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు అడిషనల్ సొలిసిటర్ జనరల్ అఫ్ ఇండియాగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తన పదవికి రాజీనామా చేసి ప్రజల హక్కులను హరిస్తున్న పాలకులపై పోరాడారు.

> 'నేను లౌకిక భారత్‌లోనే పుట్టాను. లౌకిక భారత్‌లోనే పెరిగాను. దేవుడి దయ ఉంటే లౌకిక భారత్‌లోనే ప్రాణాలు వదలాలనుకుంటున్నాను' అని తన ఆత్మకథ 'బిఫోర్ మెమరీ ఫేడ్స్'లో రాసుకున్న నారీమన్ చివరి శ్వాస వరకు లౌకికవాదానికి అండగా నిలిచారు. ఇటీవలి కాలంలో దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లడంపై కూడా ఆయన గొంతువిప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు చెమటలు చిందించారు. నారీమన్ లాంటి రాజ్యాంగ కోవిదుని మరణంతో ఒక న్యాయ శకం ముగిసిందనే చెప్పాలి. కానీ, న్యాయజ్యోతి నిరంతరం వెలిగేందుకు కృషి చేసిన నారీమన్.. భవిష్యత్తులోనూ న్యాయాన్వేషణలో దివిటీలా నిలుస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఫాలీ సామ్ నారీమన్
1929-2024



సాధించిందేమీ లేదు!

వరుసగా ఎన్నికల్లో దేశ ప్రజలు తిరస్కరిస్తుండటంతో రాహుల్‌గాంధీకి మతి భ్రమించినట్టుంది. ఆయన ఏం చేస్తున్నారో ఆయనకే తెలియడం లేదు. ఐశ్వర్యరాయ్‌ను కించపరిచే స్థాయికి దిగజారిపోయారాయన. 'వారసత్వం' అండతో రాజకీయాల్లో అడుగుపెట్టిన రాహుల్‌గాంధీ ఇప్పటివరకు సాధించింది ఏమీ లేదు.

- సోనా మహాపాత్ర, గాయని

తెలంగాణలో తదుపరి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి గతేడాది నవంబర్ 30న జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయాలని ప్రజలకు బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ పిలుపునిచ్చారంటూ తెలంగాణ కాంగ్రెస్ తన అధికారిక ట్విటర్ (ఎక్స్) పేజీలో పోస్ట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అనధికారికంగా నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూపుల్లో దీన్ని విస్తృతంగా షేర్ చేసింది.

> ఈ వ్యవహారం చివరికి పోస్ట్ అధికారిక ఎక్స్ ఖాతాలో ముగిసింది. 5 లక్షల మందికి పైగా దీన్ని వీక్షించారు. అయితే అది ఫేక్ వార్త. వాస్తవానికి అది ఏఐ-జనరేటెడ్, పూర్తిగా అవాస్తవమైన ట్వీట్. కానీ, సాధారణ ఓటరు దాన్ని గుర్తించలేడు. ఓటింగ్ ప్రారంభం కావడంతో నష్ట నివారణ చర్యలు తీసుకోవడానికి బీఆర్ఎస్‌కు సమయం లేకుండాపోయింది. దాంతో బీఆర్ఎస్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఎన్నికలను శాసించే
ఏఐ ఎత్తుగడలు

స్వామి ఆర్వీవీయస్

చాకచక్యంగా, సమయానుకూలంగా సాగిన కృత్రిమమేధ సృష్టించిన డీప్‌ఫేక్ ఇటీవల వరుసగా జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో వివిధ పార్టీల విజయావకాశాలపై దెబ్బకొట్టింది. ఇదే రాబోయే సార్వత్రిక ఎన్నికలను మౌలికంగా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. ఏప్రిల్‌లో జరగనున్న ఎన్నికల్లో తమ తదుపరి జాతీయ ప్రభుత్వాన్ని దాదాపు ఒక వంద కోట్ల మంది ఓటర్లు ఎన్నుకోనున్నారు.

2020 ఫిబ్రవరిలో ప్రచారం కోసం డీప్ ఫేక్‌ను ఉపయోగించిన ప్రపంచంలోనే మొదటి వ్యక్తిగా బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ నిలిచారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు హిందీ, హర్యాన్వీ, ఆంగ్లంలో ఓటర్లను ఉద్దేశించి తివారీ ప్రసంగించిన మూడు వీడియోలను విడుదల చేశారు. కేవలం హిందీ వీడియో మాత్రమే ప్రామాణికమైనది, మిగిలిన రెండు డీప్ ఫేక్స్. అతని స్వరం, పదాలను సృష్టించడానికి, అతని వ్యక్తీకరణలు, పెదవుల కదలికను మార్చడానికి కృత్రిమమేధను ఉపయోగించారు. మామూలుగా చూసినప్పుడు అవి నకిలీవని గుర్తించడం దాదాపు అసాధ్యం.

గత నవంబరులో మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో.. మోదీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, కైలాష్ విజయ్‌వర్గియా, కమల్‌నాథ్ వంటి రాజకీయ నేతల మీద చేసిన డీప్ ఫేక్ వీడియోల సృష్టికర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. డీప్ ఫేక్‌లను జనరేట్ చేసే అనేక ఏఐ టూల్స్ ఉచితం కాగా, మరికొన్ని వీడియోకు పది రూపాయల కన్నా తక్కువకు సబ్‌స్క్రిప్షన్‌పై దొరుకుతున్నాయి. కృత్రిమమేధ ఉపకరణాల లభ్యత పెరగడంతో, ఓటర్లను ప్రభావితం చేయడానికి, అన్ని రాజకీయ పార్టీలు డీప్ ఫేక్‌లను ఉపయోగిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ చేసే డీప్ ఫేక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని గతేడాది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల పోలింగ్‌కు ముందు బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో తమ అనుచరులను పదేపదే హెచ్చరించారు. ఓటింగ్ రోజు ఉదయం కాంగ్రెస్ షేర్ చేసిన డీప్ ఫేక్ క్లిప్‌పై ఈసీఐకి వారు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది.

> ఒక వ్యక్తిని నమ్మించి తప్పుదారి పట్టించినా, అతని మనసును మార్చినా, అది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి అన్నారు. ఎన్నికల సమయంలో వదంతులు వ్యాపింపజేసే సమస్యను డీప్ ఫేక్స్ వెయ్యి రెట్లు తీవ్రతరం చేశాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామ్యానికి కలిగే నష్టాన్ని తగ్గించడానికి డీప్ ఫేక్‌లను రియల్ టైమ్‌లో తగ్గించాల్సిన అవసరం ఉందని ఖురేషీ అభిప్రాయపడ్డారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలకు దేశం సిద్ధమవుతున్న తరుణంలో పార్టీలు వినూత్నమైన, ప్రమాదకరమైన వ్యూహాల కోసం ఏఐ వైపు మొగ్గు చూపుతున్నాయి. రాజకీయం అంటే అవగాహనను సృష్టించడమే. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ (వాయిస్, వీడియో మాడ్యులేషన్) ద్వారా ఒక్క క్లిక్‌తో, ఒక్క నిమిషంలో ప్రజల అభిప్రాయాన్ని మార్చవచ్చు. పొలిటికల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మానిప్యులేటెడ్ కంటెంట్ గతంలో కంటే చాలా రెట్లు పెరుగుతుంది. ఏఐ ద్వారా ఓటర్లను తారుమారు చేయడాన్ని ఏ పార్టీ కూడా తప్పుగా భావించడం లేదు. ప్రచార వ్యూహంలో దీన్ని కూడా ఒక భాగంగా భావిస్తున్నాయి. డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉండటం, వీడియోల వినియోగం పెరుగుతుండటంతో మనదేశంలో ఎన్నికల సమగ్రతకు పెనుముప్పు పొంచి ఉంది. ఓటర్లూ.. తస్మాత్ జాగ్రత్త!